12 కోట్లు పలికిన 'టైటానిక్' వాచ్

న్యూఢిల్లీ: ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలో 1912లో మునిగిపోయిన టైటానిక్ నౌకకు సంబంధించిన కథలు ఇప్పటికీ ప్రజలను కట్టిపడేస్తున్నాయి. ఈ నౌకలో ప్రయాణించి, ప్రాణాలు కోల్పోయినవారి జ్ఞాపకాలు చెక్కు చెదరకుండా నిలిచి ఉన్నాయి. అప్పటి ప్రమాదంలో మరణించిన అత్యంత సంపన్న వ్యాపారవేత్త జాన్ జాకబ్ ఆస్టర్ (47)కు గల గోల్డ్ పాకెట్ వాచ్ తాజాగా సరికొత్త రికార్డు సృష్టించింది. అమెరికాలోని హెన్రీ ఆల్డ్రిడ్జ్ అండ్ సన్ వేలం సంస్థ శనివారం నిర్వహించిన వేలంలో ఈ వాచీని రూ.12.17 కోట్లకు ఓ వ్యక్తి సొంతం చేసుకున్నారు. ఈ నౌక మునిగిపోతున్నపుడు ఓ ప్యాసింజర్ వాయించిన వయోలిన్‌ను ఇదే సంస్థ 2013లో వేలం వేసింది. అప్పట్లో దానికి పలికిన ధర (1.1 మిలియన్ పౌండ్లు) రికార్డు సృష్టించింది.

స్వలింగ సంబంధాలకు 15 ఏండ్ల జైలు

చట్టాన్ని ఆమోదించిన ఇరాక్

బాగ్దాద్, ఏప్రిల్ 28: స్వలింగ సంపర్క సంబంధాలను నేరంగా పరిగణిస్తూ ఇరాక్ పార్లమెంట్ ఒక చట్టాన్ని ఆమోదించింది. దీనిని ఉల్లంఘించిన వారికి 15 ఏండ్ల గరిష్ఠ కారాగార శిక్ష విధించనున్నట్టు పేర్కొంది. అయితే ఇది ఎల్జీబీటీ కమ్యూనిటీపై దాడిగా హక్కుల న్యాయవాదులు ఖండించారు. ఇరాక్ సమాజాన్ని నైతిక పతనం నుంచి రక్షించడానికి, ప్రపంచంలో పెరిగిపోతున్న స్వలింగ సంపర్కాన్ని నిరోధించడానికి ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్టు ఇరాక్ తన చట్టంలో పేర్కొంది. ప్రభుత్వంలో ప్రధాన భాగస్వాములుగా ఉన్న సంప్రదాయ షియా ముస్లిం పార్టీల ఒత్తిడి మేరకు ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ చట్ట ప్రకారం వ్యభిచారం, స్వలింగ సంపర్కాన్ని నిరోధిస్తూ.. వాటిని అతిక్రమించిన వారికి కనీసం 10, గరిష్ఠంగా 15 ఏండ్ల కారాగార శిక్షను విధిస్తారు. అలాగే వీటిని ప్రోత్సహించిన వారికి కనీసం ఏడేండ్ల జైలు శిక్ష విధిస్తారు.

ఉద్యోగాలపై ఏఐ కత్తి!

- కృత్రిమ మేధ, ఆటోమేషన్‌తో కోట్లాది ఉద్యోగాలకు ముప్పు
- ఏఐతో 40 కోట్ల ఉద్యోగాల భర్తీ
- ప్రపంచ శ్రామిక శక్తిలో 15%
- మెకిన్సే నివేదిక అంచనా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ).. నేటి టెక్ యుగంలో ఇదో సంచలనం. అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ఏఐ నాంది పలికింది. అయితే ఇది రెండు వైపులా పదునున్న కత్తిలాంటిది. దీనితో లాభాలు ఎన్ని ఉన్నాయో నష్టాలూ అన్నే ఉన్నాయి. ఏఐ రాకతో అనేక మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగంపై దీని ప్రభావం అధికంగా ఉన్నది. ఏఐ, ఆటోమేషన్ వల్ల గణనీయ సంఖ్యలో ఉద్యోగాలకు కోత పడుతున్నది. దీని వల్ల ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగాలు మారడమో లేదా కొత్త అవసరాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ కావడమో, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడమో చేయాల్సి ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. గతంలోనూ పలు కొత్త సాంకేతికతలు అందుబాటులోకి వచ్చిన సమయంలోనూ ఇలాంటి సందర్భాలు చూశామని గుర్తు చేస్తున్నారు. కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(సీఎంఎస్) రావడంతో హెచ్‌టీఎంఎల్‌పై ప్రత్యేకంగా పనిచేసే 'వెబ్‌మాస్టర్స్' అనే రోల్స్ కనుమరుగైన విషయాన్ని చెబుతున్నారు.

మరింత క్లిష్టంగా పరిస్థితులు

భవిష్యత్తుల్లో దాదాపు 40 కోట్ల ఉద్యోగాలను ఏఐ భర్తీ చేస్తుందని, ఇది మొత్తం ప్రపంచ శ్రామిక శక్తిలో 15 శాతమని మెకిన్సే నివేదిక అంచనా వేసింది. మన దేశంలోనే ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలుగా ఉన్న ఐఐటీల విద్యార్థులు కూడా ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు పొందడం గగనంగా మారింది. డాటా సేకరణ, డాటా ప్రాసెసింగ్‌కు సంబంధించిన ఐటీ ఉద్యోగాలకు డిమాండ్ క్రమంగా పడిపోతున్నది. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశాలు తాజా పరిస్థితులు మరింత క్లిష్టంగా ఉండనున్నాయి. ప్రతి ఏటా జాబ్‌మార్కెట్‌లోకి ప్రవేశించే లక్షలాది మంది యువతకు ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉంటుంది.

పలు ఇతర రంగాల్లో ఉద్యోగాల సృష్టి

టెక్నాలజీ అభివృద్ధి, విస్తరణ అనేది నిరంతరాయంగా కొనసాగుతుంది. అయితే ఏఐతో కోల్పోయే ఉద్యోగాలు విషయం అటుంచితే.. మరోవైపు కొన్ని ఇతర రంగాల్లో ఉద్యోగాల సృష్టి జరుగుతుందని విశ్లేషకులు అంటున్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణ, ఆరోగ్య రంగం, గ్రీన్ ఎనర్జీ, శక్తి పరివర్తన, ఇతర డీప్ టెక్ డొమైన్స్‌లో కొత్తగా 80 కోట్ల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని, ఇది ప్రపంచ శ్రామిక శక్తికి 21-33 శాతం వరకు జోడిస్తుందని చెబుతున్నారు. మరోవైపు భారత్‌లో ప్రస్తుతం దాదాపు 3 వేలకు పైగా ఉన్న డీప్ టెక్ స్టార్టప్‌ల(ఇంజినీరింగ్‌లో హైటెక్ ఆవిష్కరణలు లేదా గణనీయ శాస్త్రీయ పురోగతి ఆధారిత వ్యాపార నమూనా గల సంస్థలు) సంఖ్య 2030 నాటికి 10 వేల దాటుతుందని నాస్కామ్ అంచనా వేసింది.

రోబోనే పెళ్లాడతా!

- 'గిగా'పై మనసు పడ్డ రాజస్థాన్ ఇంజినీర్
- రూ.19 లక్షల ఖర్చుతో 'వధువు' తయారీ

జయపుర: రోబో సినిమాలో ప్రేమకథను గుర్తుకు తెచ్చే ఘటన రాజస్థాన్‌లో చోటుచేసుకొంది. కాకపోతే ఈ లవ్ స్టోరీలో మనిషి రోబోను ప్రేమించి పెండ్లి చేసుకోబోతున్నాడంతే! ఇందుకోసం ఆ వరుడు ఏకంగా రూ.19 లక్షలు వెచ్చించి తమిళనాడులో పెండ్లి కూతురైన 'గిగా' రోబోను తయారు చేయిస్తున్నారు. రాజస్థాన్‌లోని జయపుర జిల్లా సీకర్ నివాసి అయిన సూర్యప్రకాశ్‌కు చిన్నప్పటి నుంచి రోబోలంటే ఎంతో ఆసక్తి. ఆ ఆసక్తితోనే రోబోటిక్స్ చదివి చాలా రోబోటిక్ ప్రాజెక్టుల్లో పని చేశారు. ఆ క్రమంలోనే రోబో గిగాను ప్రేమించారు. దాన్నే పెండ్లి చేసుకుంటానని తన కుటుంబానికి చెప్పారు. మొదట వారు ఈ విషయం విని షాక్ తిన్నా.. తర్వాత ఒప్పుకున్నారు. గిగా రోబోకు ఢిల్లీలో ప్రోగ్రామింగ్ చేయిస్తానని సూర్యప్రకాశ్ చెప్తున్నారు. 'నేను గిగాను సంప్రదాయబద్ధంగా పెండ్లి చేసుకొంటా. గిగా ఎనిమిది గంటలు పని చేస్తుంది. ఇది అందరినీ హాలో అని పలకరిస్తుంది. అని తనకు కాబోయే భార్య గురించి గొప్పగా చెప్పారు సూర్యప్రకాశ్!

ట్రాఫిక్ ధ్వనితో హృద్రోగాలు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: ట్రాఫిక్‌లో వాహనాల రొద, హారన్ల మోతతో చికాకు వస్తుంది. చికాకు మాత్రమే కాదు.. హృద్రోగ ముప్పునకు కూడా ట్రాఫిక్ ధ్వని కారణం అవుతున్నదని శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రతి 10 డెసిబుల్స్ ధ్వని పెరుగుదలతో చాలా మందిలో గుండెపోటు, మధుమేహం తదితర సమస్యలు 3.2 శాతం పెరుగుతున్నాయని తేల్చారు. ఇకపై హృద్రోగాలకు ట్రాఫిక్ ధ్వని కూడా ఒక కారణంగా నిర్ణయించాల్సిన అవసరం ఉన్నదని జర్మనీకి చెందిన యూనివర్సిటీ మెడికల్ సెంటర్ మెయింజ్ పరిశోధకులు తెలిపారు. ముఖ్యంగా రాత్రిపూట ట్రాఫిక్ ధ్వని వల్ల నిద్రభంగం ఏర్పడి, రక్తనాళాల్లో ఒత్తిడి హార్మోన్లు పెరిగి రక్తపోటుకు కారణం అవుతున్నదని వివరించారు. ఈ అధ్యయనాన్ని దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం రోడ్డు, రైలు, విమాన ట్రాఫిక్ ధ్వనిని నియంత్రించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

అవ్వాతాతల ఆహారం.. మనవళ్లపై ప్రభావం!

న్యూఢిల్లీ: అవ్వాతాతలు తినే ఆహారం వారి మనవళ్లపై ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనంలో తేలింది. వారి జన్యు లక్షణాల్లో మార్పునకు దారితీస్తున్నదని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ సైంటిస్టులు కనుగొన్నారు. 8 దశాబ్దాలుగా వంశపారంపర్య జన్యు లక్షణాలపై అధ్యయనం చేపట్టిన సైంటిస్టులు, ఆహార ఎంపికలు కూడా జన్యు మార్పిడికి కారణమవుతున్నట్టు తేల్చారు. నెదర్లాండ్స్‌లో నాజీలు ఆక్రమించుకున్న ప్రాంతాల ప్రజల 'ఎపిజెనిటిక్స్'ను సైంటిస్టులు ఉదహరించారు. 2 వేల కిలో క్యాలరీల శక్తినిచ్చే ఆహారం పొందలేక, కేవలం 400 నుంచి 800 కిలో క్యాలరీల శక్తినిచ్చే ఆహారంతో సరిపుచ్చుకోవటం, వారి పిల్లల జన్యుమార్పిడికి దారితీసిందని సైంటిస్టులు చెబుతున్నారు. పెరుగుదల, అభివృద్ధికి చెందిన ఐజీఎఫ్2 అనే జన్యువుల్లో మార్పులకు కారణమైందని కనుగొన్నారు.



మహదేవ్ బెట్టింగ్ కేసులో నటుడు సాహిల్ ఖాన్ అరెస్టు

ముంబై, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో ముంబై పోలీసులు నటుడు సాహిల్ ఖాన్‌ను అరెస్ట్ చేశారు. బాంబే హైకోర్టు అతని ముందస్తు బెయిల్ దరఖాస్తును తిరస్కరించడంతో, ముంబై సైబర్ సెల్‌కు చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఛత్తీస్‌గఢ్‌లో ఆయన్ను అరెస్టు చేసింది. అంతకుముందు, 2023 డిసెంబర్‌లో సాహిల్‌తో పాటు మరో ముగ్గురిని సిట్ విచారణకు పిలిచింది. కానీ వారు హాజరు కాలేదు. కాంట్రాక్ట్ ప్రకారం తాను బ్రాండ్ అంబాసిడర్ మాత్రమేనని సాహిల్ పేర్కొన్నారు. అయితే ఈ యాప్‌కు సహ యజమాని సాహిల్ అని పోలీసులు తెలిపారు.

మాజీ రెజ్లర్‌ను పెండ్లాడిన ఇండియన్ బిలియనీర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: భారత సంతతికి చెందిన బిలియనర్, బిల్ట్ రివార్డ్స్ సీఈవో అంకుర్ జైన్, మాజీ డబ్ల్యు డబ్ల్యూఈ రెజ్లర్ ఎరికా హమ్మూండ్ శుక్రవారం ఈజిప్ట్‌లోని పిరమిడ్‌ల సాక్షిగా వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కైరోలో అత్యంత ఆడంబరంగా జరిగిన ఈ వివాహ తంతుకు ప్రముఖ సెలబ్రిటీలు లాన్స్ బాస్, మైఖేల్ టుర్చిన్, రాబిన్ థిక్కే, షార్క్ ట్యాంక్ ఇన్వెస్టర్ కెవిన్ ఓలీరీతో పాటు ఇన్‌ఫ్లుయెన్సర్‌లు మొత్తం 130 మంది హాజరైనట్టు పేజీ సిక్స్ వార్తా సంస్థ వెల్లడించింది. అతిథులు ఆఫ్రికా సఫారీ నుంచి వివాహ వేదికకు ప్రైవేట్ ఫ్లయిట్ ద్వారా చేరుకున్నారు. వాస్తవానికి 34 ఏండ్ల జైన్ తొలుత తన వివాహాన్ని అంతరిక్షంలో చేసుకోవాలని భావించారు. అయితే దీనికి ఎరికా ఆసక్తి చూపకపోవడంతో ఈజిప్ట్‌లో జరుపుకున్నారు.

వేగంగా వేడెక్కుతున్న హిందూ మహాసముద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: 2020-2100 మధ్య హిందూ మహా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 1.4 డిగ్రీల నుంచి 3 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉన్నదని తాజా అధ్యయనం అంచనా వేసింది. దీని వల్ల వడగాడ్పులు, తుఫానులు తీవ్రతరం కానున్నాయని హెచ్చరించారు. రుతు పవనాలు గతి తప్పుతాయని, సముద్ర మట్టాలు పెరుగుతాయని పేర్కొన్నారు. పుణే 'ఐఐటీఎం' వాతావరణ శాస్త్రవేత్త రాక్సీ మాథ్యూ ఈ అధ్యయనానికి నేతృత్వం వహించారు. హిందూ మహాసముద్రం వేడెక్కడం కేవలం ఉపరితలానికే పరిమితం కాలేదని, సముద్రం 2000 మీటర్ల లోతు వరకు వేడి ప్రభావం ఉంటున్నట్టు అధ్యయనం పేర్కొన్నది.

క్యూబాలో నగదు సంక్షోభం

బ్యాంకులు, ఏటీఎంల ముందు భారీ క్యూలు

హవానా, ఏప్రిల్ 28: ద్వీప దేశం క్యూబాలో నగదు సంక్షోభం ఏర్పడింది. రోజువారీ కార్యకలాపాలకు సైతం నగదు లభించకపోవడంతో ఆదివారం దేశంలోని పలు ప్రాంతాల్లో నగదు కోసం బ్యాంకులు, ఏటీఎంల ముందు పౌరులు బారులు తీరారు. కాగా, గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి ఏర్పడలేదని, దేశ ఆర్థిక సంక్షోభానికి ఈ పరిస్థితులు నిదర్శనమని పలువురు ఆర్థిక వేత్తలు వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో పెరుగుతున్న ద్రవ్య లోటు ఈ పరిస్థితికి కారణమని క్యూబాకు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త ఒమర్ ఎవర్లీనీ పేరెజ్ పేర్కొన్నారు. 1,000 క్యూబన్ పెసోలు కన్నా ఎక్కువ డినామినేషన్ ఉన్న నోట్ల అలభ్యత కూడా దీనికి కారణమన్నారు. అధిక ద్రవ్యోల్బణం కారణంగా బ్యాంకులకు నగదు తిరిగి రావడం లేదని ఆయన చెప్పారు.

దుబాయ్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద ఎయిర్‌పోర్ట్

రూ.2.9 లక్షల కోట్లతో నిర్మాణం

దుబాయ్, ఏప్రిల్ 28: ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని దుబాయ్‌లో నిర్మించబోతున్నారు. ప్రస్తుతం ఈ నగరంలోని విమానాశ్రయానికి ఐదు రెట్లు పెద్దదైన ఎయిర్‌పోర్ట్ త్వరలో ఇక్కడ ఏర్పాటుకాబోతున్నది. ఈ విషయాన్ని దుబాయ్ రాజు షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తోమ్ ఆదివారం ప్రకటించారు. 35 బిలియన్ డాలర్లు (రూ.2.9 లక్షల కోట్లు) ఖర్చుతో 'అల్ మక్తోమ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్' నిర్మాణాన్ని చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. 5 సమాంతర రన్‌వేలు, 400 ఎయిర్‌క్రాఫ్ట్ గేట్స్, 26 కోట్లమంది ప్రయాణికుల సామర్థ్యం(ఒక ఏడాదిలో) దీని ప్రత్యేకతలుగా చెప్పారు.

చిత్రం

'పుష్ప 2' అంతా స్నేహమయమే

సినిమాలో వాణిజ్య హంగులు ఎన్ని ఉన్నా, కథలో ఎమోషన్స్ లేకపోతే జనం చూడరు. అంటే సినిమా విజయానికి కావాల్సిన ప్రధాన బలం ఎమోషన్స్ అనమాట. కథలోని ఎమోషన్ కట్టిపడేస్తే ఇక ఆ సినిమా విజయాన్ని ఎవరూ ఆపలేరు. ఉదాహరణకు 'పుష్ప'నే తీసుకుందాం. ఇందులో కావల్సినన్ని వాణిజ్యహంగులున్నాయి. కానీ జనం కనెక్టయింది ఎమోషన్స్‌కే. పుష్పరాజ్‌కీ, పుష్పరాజ్ తల్లికీ మధ్య ఉండే ఎమోషన్స్, 'పుష్ప' ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్, శ్రీవల్లికీ, పుష్పరాజ్‌కీ మధ్య నడిచే భావోద్వేగాలు.. ఇవి లేకుండా 'పుష్ప'ను చూడగలమా? అసలు 'పుష్ప' అంత హిట్ కావడానికి కారణం ఆ ఉద్వేగాలే. దర్శకుడు సుకుమార్‌కు ఈ విషయం బాగా తెలుసు. అందుకే 'పుష్ప 2'లో కూడా అద్భుతమైన భావోద్వేగాలు ఉండేలా కథ రాసుకున్నారు. 'పుష్ప'లో తల్లీకొడుకుల సెంటిమెంట్, పుష్ప, శ్రీవల్లీల లవ్‌ట్రాక్ హైలైట్ అయితే.. 'పుష్ప 2'లో ఫ్రెండ్‌షిప్ హైలైట్ కానుందట. పుష్పరాజ్, కేశవల స్నేహబంధంపై అద్భుతమైన ఎపిసోడ్స్ కుదిరాయని, వీరిద్దరి మధ్య సాలిడ్ ఎమోషన్స్ ఉంటాయని తెలుస్తున్నది. అల్లు అర్జున్ పెర్‌ఫార్మెన్స్ కూడా నెక్స్ట్ లెవల్లో ఉంటుందని సమాచారం. మరి ఈ ఏడాది ఆగస్ట్ 15న రానున్న 'పుష్ప2' బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి. మైత్రీమూవీమేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే.

రొమాంటిక్ ప్రియదర్శి

కమెడియన్‌గా మొదలై, తక్కువ సమయంలోనే హీరోగా ప్రమోట్ అయ్యాడు ప్రియదర్శి. తనను హీరోగా పెట్టి సినిమాలు తీయడానికి నిర్మాతలు ఉత్సాహం చూపుతున్నారు. తాజాగా ప్రియదర్శి చేయనున్న కొత్త సినిమాకు చెందిన ప్రకటన ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి జాన్వీ నారంగ్ నిర్మాత. సునీల్ నారంగ్, భరత్ నారంగ్, ఎస్ వీఏసీఎల్ఎల్‌పీ, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా కలిసి సగర్వంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తుండటం విశేషం. సరికొత్త కాన్సెప్ట్‌తో కూడిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, ఇందులో ప్రియదర్శి విభిన్నమైన పాత్రను పోషించనున్నారని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని, త్వరలోనే ప్రీప్రొడక్షన్ పనులు ప్రారంభిస్తామని, వచ్చే ఏడాది జనవరిలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందని మేకర్స్ తెలిపారు.

పేరెంట్స్ వల్ల సినిమాలు కోల్పోయా

' కథకు న్యాయం చేయడం నటీనటుల బాధ్యత. కథ అడిగిందిమేం చేయాలి. 'నేను చేయను' అంటూ భీష్మించుకుని కూర్చుంటే ఇక్కడ ఎదగలేం.' అంటున్నది అందాలభామ మృణాళ్‌ఠాకూర్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ముద్దు సన్నివేశాలపై ఆసక్తికరంగా మాట్లాడింది మృణాళ్. 'కెరీర్ తొలినాళ్లలో ముద్దు సన్నివేశాల్లో నటించేందుకు మా పేరెంట్స్ ఒప్పుకోలేదు. ఈ కారణంతో చాలా సినిమాలను కోల్పోయాను. ఆ తర్వాత నేనే వాళ్లను ఒప్పించాను. దర్శకుడు యాక్షన్ చెప్పగానే మేం పాత్రగా మారిపోవాలి. అప్పుడు నేను మృణాళ్‌ని కాను. ఈ విషయం అమ్మానాన్నలకు అర్థం కావడానికి కాస్త సమయం పట్టింది' అంటూ చెప్పుకొచ్చింది మృణాళ్ ఠాకూర్.

తలైవి ఈజ్ బ్యాక్

సినిమాలు చేయకపోయినా సమంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఇసుమంత కూడా తగ్గలేదు. సాంఘిక మాధ్యమాల్లో ఆమెను అనుసరించేవారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. తను ఇన్‌స్టాలో ఏ పోస్ట్ పెట్టినా దానికి స్పందన అనూహ్యంగానే ఉంటుంది. సామ్ కొత్త సినిమా కోసం అభిమానులంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటే, తనేమో తీరిగ్గా ఇన్‌స్టాలో ఫొటోలను పోస్ట్ చేస్తూ కాలం గడిపేస్తున్నది. అయితే.. తాజాగా ఆమె ఇన్‌స్టాలో ఓ ఫొటో ప్రత్యక్షమైంది. అది ఆమె తాజా సినిమా పోస్టర్. సినిమాపేరు 'మా యింటి బంగారం'. సినిమా పేరైతే సున్నితంగా ఉందిగానీ.. పోస్టర్ నిండా వయొలెన్సే కనిపిస్తున్నది. ఎర్ర చీర.. మెడలో మంగళ సూత్రం.. రక్తసిక్తమైన శరీరం.. చేతిలో తుపాకీ.. చూడ్డానికి గృహిణిలా కనిపిస్తున్నది. అయితే.. ఆ రూపం చూస్తుంటే అపరకాళికలా అనిపిస్తున్నది. మరి ఈ కథేంటో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. విశేషమేంటంటే.. తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'పై సామ్ తెరకెక్కించే సినిమా ఇదే. అయితే.. ఈ పోస్టర్‌లో సమంత తప్ప మిగతా ఏ వివరాలూ లేవు. అభిమానులు మాత్రం ఆనందంతో 'తలైవి ఈజ్ బ్యాక్' అంటూ కామెంట్లు పెడుతున్నారు.

తండ్రీకొడుకుల అనుబంధం

'నేను నటించిన చిత్రాలకు పనిచేసిన దర్శకుల నుండి నేర్చుకున్న విషయాల ఆధారంగా ఈ సినిమాకు దర్శకత్వం వహించాను. ఇప్పటివరకూ వంద చిత్రాల్లో నటించా. ఆ సినిమాల దర్శకులందరూ నాకు గురువులే. వారు నేర్పిన పాఠాలతోనే దర్శకుడిగా మారాను. సముద్రఖని అన్న లేకుంటే ఈ సినిమా పూర్తయ్యేదికాదు, నేను దర్శకుడిని అయ్యేవాడ్ని కాదు. ప్రతి ఒక్కరూ నాన్నతో కలిసి చూడాల్సిన సినిమా ఇది' అని ధనరాజ్ అన్నారు. ఆయన దర్శకుడిగా మారి తెరకెక్కిస్తున్న ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. సముద్ర ఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి పృథ్వీ పోలవరపు నిర్మాత. ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. దర్శకుడు బాలా, పాండిరాజ్, నటులు బాబీ సింహా, తంబి రామయ్య, హాస్యనటుడు సూరి, దీపక్, హరీశ్ ఈ కార్యక్రమంలో పాల్గొని చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. తండ్రీకొడుకుల అనుబంధం గురించి చెప్పే సినిమా ఇదని, సముద్రఖని లేకపోతే ఈ సినిమా లేదని నిర్మాత తెలిపారు. ధనరాజ్‌పై ఉన్న నమ్మకంతో ఈ కథను తననే డైరెక్ట్ చేయమని చెప్పానని, తను కచ్చితంగా పెద్ద విజయాన్ని అందుకుంటాడని సముద్రఖని నమ్మకం వెలిబుచ్చారు.

తండ్రీకూతుళ్ల ముచ్చట్లు

'ప్రేమ ఎలా మొదలైనా.. దాని స్వభావం ఎలా ఉన్నా.. వదులుకోవడం మాత్రం కష్టం. అది ఎంత అందంగా మొదలవుతుందో.. అంత భయంకరం ముగుస్తుంది. అదొక పోరాటం' అంటున్నారు నటలోకనాయకుడు కమల్‌హాసన్. ఆయన కుమార్తె శ్రుతిహాసన్ 'ఇనిమేల్' పేరుతో స్పెషల్ సాంగ్స్‌ని విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 'ప్రేమ వారసత్వం' పేరుతో మరో పాటను శ్రుతి విడుదల చేయనున్నది. ఈ పాటకు కమల్‌హాసన్ సాహిత్యం అందించడం విశేషం. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. ఈ సందర్భంగా ఈ తండ్రీకూతుళ్లు ఓ వీడియో విడుదల చేశారు. ఆ వీడియోలో కమల్, శ్రుతిల మాటలు ఇలా సాగాయి. ' సంప్రదాయాలు, సామాజిక పరిస్థితులు నచ్చకపోతే వదిలేశాను. ప్రేమను మాత్రం వదులుకోలేకపోయాను' అని కమల్ అంటే.. ' మానాన్న నన్ను అందరిలా పెంచలేదు. ఆయన ఎమోషన్స్‌ని బయటకు కనిపించనివ్వరు. చిన్న పిల్లలు తండ్రులతో ఉండే రీల్స్ నాకాయన పంపినప్పుడు నన్ను మిస్ అవుతున్నారని నాకు అర్థమవుతుంది. నేను ఎప్పటికీ నాన్న కూచినే' అని శ్రుతి చెప్పింది. ప్రస్తుతం ఈ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నది.

'హను-మాన్' దర్శకుడితో భేటి

'హను-మాన్' దర్శకుడు ప్రశాంత్‌వర్మ ముంబయ్‌లో రణవీర్ సింగ్‌ని కలిశారు. ఈ కలయిక ప్రస్తుతం ముంబయ్ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది.



గత కొన్ని రోజులుగా రణవీర్ శక్తిమాన్ తరహా పాత్ర చేయనున్నట్టు బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. 'హను-మాన్' తర్వాత 'జై హనుమాన్' చేయనున్నట్టు ప్రశాంత్ వర్మ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరూ కలవడం బాలీవుడ్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రణ్‌వీర్ చేయనున్న ఆ శక్తిమాన్ హనుమంతుడే అంటూ మీడియాలో కథనాలు కూడా వెలువడుతున్నాయి. మరి రణ్‌వీర్‌ని ప్రశాంత్‌వర్మ 'జై హనుమాన్' కోసం కలిశారా? లేక 'జై హనుమాన్' తర్వాత తాను చేయబోయే మరో సినిమా కోసం కలిశారా? అనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

రాజు యాదవ్ గీతాలు

'జబర్దస్త్' ఫేం గెటప్‌శ్రీను హీరోగా రూపొందిస్తున్న చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకుడు. కె.ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి నిర్మాతలు. మే 17న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా 'థిస్ ఈజ్ మై దరిద్రం..' అంటూ సాగే గీతాన్ని సుడిగాలి సుధీర్ చేతులమీదుగా మేకర్స్ విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరపరచగా, రాహుల్ సిప్లిగంజ్, మంగ్లీ ఆలపించారు. ఈ పాటలో హీరోకు ఎదురయ్యే అనుభవాలు నవ్వులు పంచుతాయని మేకర్స్ చెబుతున్నారు. ప్రేమ, వినోదంతోపాటు మనసుల్ని హత్తునే భావోద్వేగాలు కూడా ఈ కథలో ఉంటాయని వారు చెబుతున్నారు. అంకిత ఖరత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆనంద్ చక్రపాణి, రాకెట్ రాఘవ, మిర్చి హేమంత్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సాయిరామ్ ఉదయ్.